క్లుప్తంగా

మిషన్ భగీరథ నీరు వృథా


వృథాగా పోతున్న నీరు

చిలుకూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో గత కొన్ని రోజులుగా మిషన్ భగీరథ పైపులైన్ లీకై నీరు వృథాగా పోతోంది. అయినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పైపులైన్ లీకవడంతో భగీరథ నీరు కలుషితం అవుతోందని, తక్షణమే అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భగవద్గీతపై క్విజ్ పోటీలు


క్విజ్ పోటీలో బహుమతులు, ప్రశంసాపత్రాలు గెలుచుకున్న విద్యార్థులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎస్ఎస్‌పీ క్యాంపు ప్రాథమిక పాఠశాలలో గత నెలలో ముంబాయికి చెందిన జూహూ ఇస్కాన్‌సంస్థ ఆధ్వర్యంలో భగవద్గీతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొనగా 5వ తరగతి విద్యార్థిని షేక్ జానీబేగం ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. విజేతలకు మంగళవారం బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పుతిలీ భేగం, ఉపాధ్యాయులు చేపూరి హేమవతి, శివయ్య, అరుణ, అనిత, శాంతి, లక్ష్మీకాంత్, ఇస్కాన్ ప్రభుజీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ


విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రూ.16 వేల విలువ గల నోటు బుక్స్‌ను లయన్స్ క్లబ్ సభ్యులు దాతల సహకారంతో అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు కంప్యూటర్ నేర్చుకునేందుకు లయన్స్ క్లబ్ సభ్యులు గుండా రామ్మూర్తి సహకరిస్తానని హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, సీతారాంరెడ్డి, రామస్వామి, సూర్యనారాయణరెడ్డి, రంగారెడ్డి, చందులాల్, సైదులు, వెంకన్న, లాకాస్, ఉపాధ్యాయులు పద్మావతి, సైదులు, రశీద్‌ఖాన్, వెంకటేశ్వర్‌రావు, నర్సింహారావు, మాధవి, శ్రీనివాస్‌రావు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం


మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవా యూత్ సభ్యులు

మునగాల : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా మంగళవారం సేవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. సేవ యూత్ అసోసియేషన్ సభ్యుడు సిరికొండ అజయ్ ఆధ్వర్యంలో 20 లీటర్ల మజ్జిగను బాటసారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవ యూత్ సభ్యులు మీసేవశర్మ, రాచకొండ పవన్, అమరోజు సాయి, యల్లయ్య, సిరికొండ అజయ్, వెంకటేష్, గోపి, కిరణ్, నాగరాజు, రాజేష్ పాల్గొన్నారు.

27 నుంచి హుజూర్‌నగర్‌లో వేసవి శిక్షణ శిబిరం

హుజూర్‌నగర్ : పట్టణంలో శ్రీరామకృష్ణ సేవా సమితి హుజూర్‌నగర్ ఆధ్వర్యంలో ఈ నెల 27న నుంచి వచ్చే నెల 27వ వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు సమితి సభ్యులు మంగళవారం తెలిపారు. ఈ శిబిరంలో 4 నుంచి 10వ తరగతి విద్యార్థులకు యోగ, ధ్యానం, భగవద్గీత శ్లోకాలు, వ్యక్తిత్వ వికాస తరగతులు, స్పోకెన్ ఇంగ్లిష్, నీతి శ్లోకాలు నేర్పిస్తారని తెలిపారు. శిక్షణ రుసుం రూ.700 ఉంటుందని, ప్రతి రోజు అల్పాహారం అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఇతర వివరాలకు 9440708907 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

చిలుకూరు : ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు గుడారాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రెమిదాల రాజు అన్నారు. మంగళవారం చిలుకూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేట్లు చిలువేరు ఆంజనేయులు, మల్లెపంగు ఉపేందర్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలపై సర్వే

- భూగర్భ జలాల పెంపుపై మున్సిపల్ అధికారుల దృష్టి
- ప్రజలను చైతన్యపరుస్తూ ఇంటింటి సర్వే
- 358 చదరపు గజాల స్థలంలో గల నిర్మాణంలో ఇంకుడు గుంత తప్పనిసరి
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


నేరేడుచర్లలో నిర్మించిన ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో భూగర్భ జలాల పెంపుపై మున్సిపల్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఈమేరకు ఇటీవల మున్సిపల్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో మున్సిపాలిటీలో ఇంకుడు గుంతలపై ఇంటింటి సర్వే చేపట్టడంలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమైంది. అయితే 358 చదరపు గజాలు కలిగిన ప్రతి నిర్మాణానికి ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ అయ్యాయి. లేకుంటే రెండు వారాల్లో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు సూచిస్తున్నారు. బడులు, భవన సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంత ఏర్పాటు తప్పనిసరి అని చెబుతున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే..

వర్షపు నీటిని ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలా చేసేందుకు గాను ఇళ్లల్లో ఇంకుడు గుంతలు నిర్మించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు నిర్లక్ష్యం చేసిన గృహ యాజమానులపై చర్యలకు ఉపక్రమించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీలో 358 చదరపు గజాల విస్తీర్ణంలో గల ఇళ్ల నిర్మాణంలో ఇంకుడు గుంతలు నిర్మాణం చేశారా? ఉపయోగంలో ఉన్నాయా? ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఉందా.. లేదా అనే అంశాలతో పాటు ఇంకుడు గుంతలు లేని గృహాలు ఎన్ని ఉన్నాయనే లెక్కలను తేల్చేందుకు ఇంటింటి సర్వే చేపట్టారు.

వార్డు అధికారుల నియామకం..

నేరేడుచర్ల మున్సిపాలిటీలో 4262 గృహాలు ఉన్నాయి. మున్సిపాలిటీలో ఇంకుడు గుంతల సర్వేకు 15 వార్డులకు గాను 14 మంది వార్డు ఆఫీసర్లను నియమించారు. ఒక్కో వార్డు ఆఫీసరు ద్వారా 358 గజాల భూమి ఉన్న వారు ఇంకుడు గుంతను నిర్మించారా..? లేదా అని గుర్తిస్తారు. మున్సిపాలిటీలో 358 గజాల స్థలంలో నిర్మాణం ఉన్నప్పటికీ ఇంకుడు గుంత లేని 20 మంది యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టకపోతే వారికి నూతన మున్సిపల్ చట్టం ప్రకారం జరిమానాతో పాటు కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపల్ కమిషనర్ సూచనల మేరకు మున్సిపల్ ఇంజనీర్లు, పట్టణ ప్రణాళిక విభాగం, శానిటేషన్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలిస్తున్నారు.

ముమ్మరంగా సర్వే చేస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంకుడు గుంతలపై ఇంటింటి సర్వే ప్రారంభించాం. క్షేత్రస్థాయిలో సర్వే చేసేందుకు 15 వార్డుల్లో 14 మంది వార్డు ఆఫీసర్లను నియమించాం. ప్రస్తుతం ఈ సర్వే ముమ్మరంగా జరుగుతోంది. సర్వే పూర్తైన తరువాత నివేదికను ప్రభుత్వానికి అందిస్తాం.
– అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, నేరేడుచర్ల

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలుకూరు : మండలంలోని బేతవోలు ఫీడర్ పరిధిలో గల బేతవోలు, పోలేనిగూడెం గ్రామాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున ఆయా గ్రామాల్లో బుధవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె. సైదయ్య మంగళవారం విలేకరులకు తెలిపారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గరిడేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

గరిడేపల్లి : గరిడేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గరిడేపల్లి ఫీడర్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్నందున బుధవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు గరిడేపల్లి ఫీడర్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రావిరాల నగేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హుజూర్‌నగర్ పట్టణంలో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని 1వ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైనుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించుట గురించి బుధవారం పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని దద్దనాల చెరువు కాలనీ, మల్లన్ననగర్, ఎన్‌జీఓస్ కాలనీ, సాయిబాబా థియేటర్ రోడ్డు, టీచర్స్ కాలనీ, సుందరయ్య నగర్, గోవిందపురం ఏరియాలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బూరుగడ్డ ఆలయంలో తిరుకల్యాణ మహోత్సవం


గరుడ హోమం నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీగోదాదేవి తిరుకల్యాణ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో తెల్లవారు జామున చైత్ర శుద్ధ పౌర్ణమి, సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, యజ్ఞశాల ప్రవేశం, గరుడ హోమం, ధ్వజారోహణం, నిత్యపూర్ణాహుతి, బలిహరణ, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం శ్రీవేణుగోపాలస్వామి రుక్మిణి, సత్యభామ సమేతముగా గజవాహన సేవ, గోదాదేవికి పల్లకీసేవతో ఎదుర్కోళ్లు అనంతరం తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మణారావు, అర్చకులు ముడుంబై శ్రీనివాసాచార్యులు, హరీష్‌కుమార్ చార్యులు, మనోహరాచార్యులు, మధుసూదనాచార్యులు, జనార్దనాచార్యులు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు యరగాని భిక్షం, యరగాని నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి


రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని శ్రీకోదండ రామాలయంలో మంగళవారం హనుమన్ జయంతిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

కోదాడరూరల్ : పట్టణంలోని వీరబ్రంహేంద్రస్వామి ఆలయంలో గల అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ఆకుపూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఏలూరి కార్తీక్ సాయి జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ దాతలు మాధవి, రాజశేఖర్, రాజారావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకురి అంజయ్య, కోట తిరపతయ్య, హనుమంతరావు, కృష్ణమూర్తి, సత్యం తదితరులు ఉన్నారు.

'సాక్షి' మ్యాథ్స్-బీలో ద్వితీయ స్థానం


ప్రశంసాపత్రం అందుకుంటున్న లిఖిత్ సాయి

కోదాడరూరల్ : హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'సాక్షి' మ్యాథ్స్- బీ రాష్ట్ర స్థాయి పోటీల్లో కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల తేజ విద్యాలయంలో 8వ తరగతి విద్యార్థి లిఖిత్ సాయి ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచాడు. దీంతో విద్యార్థికి ప్రశంసాపత్రంతో పాటు రూ.5వేల నగదు అందజేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమా మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా లిఖిత్‌ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని గణపవరంలో గల శ్రీవరవర రంగనాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నిర్వహిస్తున్న రెండు రాష్ట్రాల స్థాయి మహిళ, పురుషుల ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ముగ్గుల పోటీలతో పాటు ట్రాక్టర్ రివర్స్ పోటీలు, బాలనాగమ్మ పౌరాణిక నాటకం ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అర్ధరాత్రి స్వామివారి కల్యాణ వేడుకలను నిర్వహించేందుకు కమిటీ సభ్యులు, గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇర్ల లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ సింగారెడ్డి హిమబిందు సుమన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పొట్టా శ్రీవిజయకిరణ్, మాజీ ఎంపీటీసీ ఇర్ల అన్నపూర్ణ, సీతారాంరెడ్డి, కమిటీ సభ్యులు కంపసాటి నాగేశ్వరరావు, సాయిని సీతయ్య, కుక్కడపు గుర్వయ్య, లింగంపల్లి భిక్షం, బల్లారి సైదులు, ఉల్లి నాగలక్ష్మి, వీరబాబు ఈఓ వెంకట చలపతి తదితరులు ఉన్నారు.

బీజేపీ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం


శ్రీరంగాపురంలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

నడిగూడెం : తెలంగాణలో బీజేపీ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, ఎన్నికల మండల ఇన్‌చార్జ్ బండారు కవిత అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీరంగాపురంలో నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవోపేతం.. విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం


స్వామివార్ల విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న మహిళలు

మఠంపల్లి : మండలంలోని గుండ్లపల్లిలో దేవతామూర్తుల ప్రతిష్ఠాపనోత్సవాన్ని మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. యజ్ఞకర్త బొర్రా వెంకటవాసుదేవాచార్యులు, వావిలాల లక్ష్మీ నారాయణశర్మ, నరగిరినాదుని సత్యనారాయణాచార్యులు, సాయికృష్ణమాచార్యులు, కొండిలశర్మ, వెంకటనాగేంద్రశాస్త్రిల నేతృత్వంలో శ్రీసీతారామ, లక్ష్మణ, హనుమాన్, గణపతి, రమాసహిత సత్యనారాయణస్వామి విగ్రహాల పునః ప్రతిష్ఠ మహోత్సవం, నవగ్రహసహిత రామలింగేశ్వరస్వామి, మహిషాసురమర్ధిని విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. హోమం పూర్ణాహుతి చేసి శాంతికల్యాణం జరిపారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీబాలగురప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు


రామాపురం గ్రామంలో నిర్మించిన శ్రీ బాలగురప్ప ఆలయం

నడిగూడెం : మండలంలోని రామాపురం చెరువు వద్ద మర్రిచెట్టు కింద నూతనంగా నిర్మించిన శ్రీబాల గురప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు 24వ తేదీ నుంచి 26 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీబాలగురప్పస్వామి, గంగమ్మ, చౌడమ్మ, శ్రీకృష్ణ, లక్ష్మీసరస్వతి, నందీశ్వర, పోతరాజుల విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం గణపతి పూజ, పుణ్యావచనం, రక్షాబంధనము, దీక్షాధారణ, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, 25న వేదపారాయణం, మూలమంత్ర హోమాలు, రక్షణోద్ధారణ, నవకలశ, పంచామృత అభిషేకాలు, 26న కలాన్యాస హోమాలు, గర్తన్యాసము, ధాదున్యాసము, భీజిన్యాసము, యంత్రస్థాపన, విగ్రహాల స్థిర ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. అనంతరం అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా, ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతికి నిర్వాహకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

అనుమతులు లేని వెంచర్లపై చర్యలు

- అదనపు కలెక్టర్ ప్రియాంక


హుజూర్‌నగర్ శివారులోని వెంచర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

హుజూర్‌నగర్ : అనుమతులు లేని వెంచర్లపై చర్యలు తప్పవని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక అన్నారు. హుజూర్‌నగర్ పరిధిలోని గోవిందపురం శివారులో గల 702 సర్వే నంబర్‌లో ఏర్పాటు చేసిన వెంచర్‌ను మంగళవారం ఆమె పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనుమతి లేని వెంచర్ హద్దురాళ్లను తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. కొన్న వారికి నోటీస్ జారీ చేయాలని, రిజిస్ట్రార్ కార్యాలయానికి కూడా నోటీస్ పంపాలని తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు ఉన్న వెంచర్లలోనే ప్రజలు ప్లాట్లు కొనాలని సూచించారు. లేకుంటే కొన్నవారే నష్టపోతారని ఆమె చెప్పారు. ప్రజలకు తాగు నీటికి ఇబ్బందులు రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీఓ శ్రీనివాసులు, డీటీసీపీ ఆఫీసర్ రాహుల్, టీపీఓ శివ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పర్యటనను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న ఒంటెద్దు నర్సింహారెడ్డి

నేరేడుచర్ల : మిర్యాలగూడ, సూర్యాపేటల్లో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎంపీ ఎన్నికల పరిశీలకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి కోరారు. మంగళవారం నేరేడుచర్లలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 9 పోయి నాలుగు నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ రైతు రుణ మాఫీ చేయలేదని, ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామని ఇచ్చిన హామీ మరిచిందన్నారు. పెళ్లి చేసుకున్న యువతులకు ఇస్తామన్న తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజలకు వివరించి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి ఓటు వేయాలని కోరాలని అన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, నాయకులు సైదులు, శ్రీధర్, అచ్చిరెడ్డి, నవీన్ తదితరులు ఉన్నారు.

పశుసంరక్షణపై రైతులకు అవగాహన


మునగాల : రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి భాస్కర్


కోదాడరూరల్ : ఎర్రవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగేంద్రబాబు

మునగాల : మండల కేంద్రంలోని పశువైద్యశాలలో మంగళవారం రైతులకు వేసవి తీవ్రత నుంచి పశువుల సంరక్షణ, యాజమాన్యంపై పశువైద్యాధికారి ఇ.భాస్కర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులను ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు మేతకు తీసుకువెళ్లాలని సూచించారు. పశువులకు చల్లని తాగునీరు, తడిపిన మేతను వేయాలని చెప్పారు. పశువులను నీడలో ఉంచాలని, పశువుల షెడ్లకు గోనెసంచులు కట్టి వేడి గాలి లోపలికి రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు ఎం.సైదులు, ఎం.సురేష్, , డి.సతీష్, రైతులు పాల్గొన్నారు.

వేసవిలో పశువులను సంరక్షించుకోవాలి

కోదాడరూరల్ : వేసవి కాలంలో పశువులను సంరక్షించుకోవాలని మండల పశువైద్యాధికారి నాగేంద్రబాబు రైతులకు సూచించారు. మంగళవారం కోదాడ మండల పరిధిలోని ఎర్రవరం పశువైద్యశాలలో వేసవిలో పశువుల యాజమాన్యంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువులు వడదెబ్బకు గురికాకుండా ఉదయం 11 గంటల లోపు సాయంత్రం 5 గంటల తర్వాత మేపుకోవాలని తద్వారా పాల దిగుబడి తగ్గదని తెలిపారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున పాడి గేదెలు, సంకర జాతి ఆవులు, దూడలను పాకల్లో కానీ చెట్ల కింద కట్టేసి తడుపుతూ ఉండాలని తెలిపారు. వేసవిలో పశువులను వదిలేయొద్దని, వదిలేస్తే రోడ్డు ప్రమాదాలకు గురై మృతి చెందే అవకాశం ఉందని అన్నారు. పచ్చిగడ్డి కొరతను అధిగమించేందుకు పశుగ్రాసాలను సాగు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు నెట్టం నాగయ్య, కోదండ రామయ్య, నాగుల్‌మీరా, వీరబాబు తదితరులు ఉన్నారు.

ధ్వజస్తంభానికి జలాభిషేకం


జలబిందెలతో ఆలయం వద్దకు ఊరేగింపుగా వస్తున్న మహిళలు


ధ్వజస్తంభానికి అభిషేకం

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ దేవాలయంలో గణపతి, సుబ్రహ్మణ్యస్వామి నవగ్రహ, జీవ ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం మహిళలు జలబిందెలతో గ్రామంలో ప్రదర్శనగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ధ్వజస్తంభానికి జలాభిషేకం చేశారు. బుధవారం యంత్ర స్థాపన, కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పదవీ విరమణ పొందిన హెచ్ఎంకు సన్మానం


పదవీ విరమణ పొందిన సుధాకర్ దంపతులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నేరేడుచర్ల : పదవీ విరమణ అనంతరం ప్రతిఒక్కరూ సమాజ శ్రేయస్సు కోసం సేవ చేయాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎల్.శ్రీనివాస్‌రావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నేరేడుచర్ల మండలం దాసారం ప్రాథమిక పాఠశాలలో పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు నాయిని సుధాకర్ దంపతులను పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రమావత్ దీప్లానాయక్, నాయకులు వెంకన్న, ప్రసాద్, సైదిరెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, పుల్లయ్య, వెంకట్‌రెడ్డి, జానయ్య, నాగయ్య, శ్రీను, రంగారెడ్డి, లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైరు చోరీపై ఫిర్యాదు

మఠంపల్లి : మండలంలో 15రోజులుగా నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కోరు, కాపరువైరు తదితర సామగ్రిని చోరీ చేస్తున్న దుండగులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ట్రాన్స్‌కో ఏఈ హరీష్‌రెడ్డి మంగళవారం మండల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన చింతల సత్యం వ్యవసాయం భూమిలో ఉన్న 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్, గాదె ఎలియాస్‌రెడ్డి పొలం వద్ద ఉన్న 63కేవీ, వీవీహైస్కూల్‌లో 16కేవీ, గొలమారి సునీల్‌రెడ్డి పొలం వద్ద ఉన్న 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల పైభాగం విప్పి కోరు, కాపర్‌వైరును గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారని, వాటి విలువ సుమారు రూ.లక్షా 50వేలు ఉంటుందన్నారు. నిందితులను వెంటనే పట్టుకుని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిపారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

నడిగూడెం : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎస్‌వీ టెక్నో స్కూల్ కరస్పాండెంట్ కాసాని ఉపేందర్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన సాంఘిక సంక్షేమ గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులను మంగళవారం ఆ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించి మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఎంపికైన విద్యార్థులు వరుణ్, నిహారిక, తేజస్విని, వంశీకృష్ణ, తమన్, మోహన్, సాయి, నెహ్రూ, అఖిల తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి లోనైతే 14416 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలి

నడిగూడెం : ఎవరైనా మానసిక ఒత్తిడికి లోనైతే టెలీ మానస టోల్‌ఫ్రీ నంబర్ 14416ను సంప్రదించాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి లక్ష్మీప్రసన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరగా చిరాకు పడడం, ఆసక్తిని కోల్పోవడం, నిద్రలేమి, నిరాశావాదం, నిస్సహాయత, ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం, ఒంటరిగా ఉండాలనుకోవడం తదితర లక్షణాలు అనిపిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబరును సంప్రదించి ఉచిత సలహాలు పొందవచ్చని సూచించారు.